
మర్పల్లిలో కప్ప కావిడి ఆడుతున్న మహిళలు


డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

» అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల, గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలెబుల్ స్కూల్‌లో విద్యార్థుల ఎంపిక నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో 1, 5వ తరగతి విద్యార్థులను డ్రా ద్వారా ఎంపిక చేయగా, గిరిజన అభివృద్ధి శాఖలో 3, 5, 8వ తరగతుల్లో 22 సీట్లకుగాను దరఖాస్తు చేసుకున్న 22 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతిలో 88 ఖాళీలకు గాను 139 మంది దరఖాస్తు చేసుకోగా గ్రూపుల వారీగా సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. గ్రూప్1లో 6 సీట్లకు గాను 2, గ్రూప్ 2కు 53 సీట్లకు గాను 87 మంది దరఖాస్తు చేశారని, గ్రూప్ 3కి 29 సీట్లకు గాను 50 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. 1వ తరగతిలో 88 సీట్లకు గాను 84 మంది విద్యార్థులు, 5వ తరగతిలో 91 సీట్లకు గాను 17 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిని ఎంపిక చేసినట్లు తెలిపారు. డ్రాలో ఎంపికైన వారికి జూలై 3వ తేదీన ఎంపిక పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి, సహాయ సంక్షేమాధికారులు శుక్లవర్ధన్ రెడ్డి, వీరానందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

» జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి


ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ఉమాగౌరి

కీసర, జూన్28(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రుల్లో నియమ, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి హెచ్చరించారు. సాధారణ తనిఖీలో భాగంగా శనివారం ఆమె కీసరలోని కేసరి ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులో ఉన్న ప్రకారం అక్కడ డాక్టర్లు, నర్సులు లేకపోవడం వంటి విషయాలపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆసుపత్రి యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వాలని హెచ్చరించారు.

అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధుల పరిస్థితి 'బూడిదలో పోసిన పన్నీరు'లా మారుతోంది. కాంట్రాక్టర్లు.. రాజకీయ నాయకులు, అధికారుల అండతో నిబంధనలను గాలికి వదిలి ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తున్నారు. ఏం చేసినా తమని అడిగేవారు లేరన్నట్లు అధికారులు సైతం రికార్డులు చేస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. అవసరం లేకపోయినా, రోడ్డు ఉండగానే దానిపై నుంచి మళ్లీ రోడ్డు వేసి మరీ బిల్లులు దండుకుంటున్నారు. ఇటీవల పరిగి పట్టణంలో వేసిన ఓ సీసీ రోడ్డే ఇందుకు ఉదాహరణ. తేలికపాటి వర్షానికే ఆ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిందంటే పనుల నాణ్యత ఏ పాటిదో అర్థం అవుతుంది.


పరిగి 15వ వార్డులో తేలికపాటి వర్షానికి కొట్టుకుపోయిన సీసీ రోడ్డు

నాణ్యత... నగుబాటు!

ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనులు

- కమీషన్ల కక్కుర్తితో నాసిరకం పనులు
- నిబంధనలు పట్టించుకోని కాంట్రాక్టర్లు
- ఇసుక లేకుండానే నిర్మాణ పనులు
- బాగున్న రోడ్లపైనే మళ్లీ నిర్మాణం
- కొత్త కాలనీల అభివృద్ధిని మరిచిన పాలకులు
- పరిగి మున్సిపాలిటీలో అస్తవ్యస్తం!

పరిగి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కమిషన్ల కక్కుర్తి వలన నాలుగు కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన అభివృద్ధి పనులు నాసిరకంగా చేపడుతున్నారు. గుత్తేదార్లు నిబంధనలను తుంగలో తొక్కి నాణ్యతను గాలికి వదిలేస్తున్నారు. ముందు పనులు చేసుకుంటే పోతుంటే, వెనుకాల నిర్మాణాలు కూలిపోతున్నాయంటే ఈ పనుల నాణ్యత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు ఏం చేసినా తమని అడిగే వారేవరన్నట్లు ఇంజనీరింగ్ అధికారులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్లను తమకు ఇష్టం వచ్చినట్లుగా వేస్తున్నారు. ఇలాంటి కోవలోకి వచ్చేదే పరిగిలోని 15 వార్డులో బొడ్రాయి నుంచి మార్కెట్ యార్డు వకు వేసిన సీసీ రోడు. అక్కడ గతంలో వేసిన సీసీ రోడ్డు బాగానే ఉండే, అయినా నిధులు దుర్వినియోగం చేయాలనే ఆలోచనతో ఆ రోడ్డుపై మళ్లీ సీసీ వేశారు. వేసిన ఆ రోడ్డయినా నాణ్యతగా వేశారా? అంటే అదీ లేదు. అసలు నిర్మాణం సిమెంట్‌ను ఉపయోగించరా? అన్న అనుమానం రాక మానదు ఆ రోడ్డును చూస్తుంటే.. కేవలం డస్ట్ చల్లి రికార్డు చేసుకోవడం గమనార్హం. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో పాత సీసీ రోడ్డే దర్శనమిస్తోంది. ఇలా ఈ ఒక్క రోడ్డు కాదు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న చాల రోడ్ల పరిస్థితి ఇదేవిధంగా ఉందని చెప్పవచ్చు.


తిరుమల రెసిడెన్సీలో రోడ్ల పరిస్థితి ఇలా

పట్టని కొత్త కాలనీల అభివృద్ధి

పాత పరిగిలోని కాలనీల్లో మంచిగా ఉన్న రోడ్లపైనే తిరిగి రోడ్లు వేసిన పరిస్థితి. కొత్తగా వెలుస్తున్న కాలనీల అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు. రాజకీయ నాయకులు స్వార్థం అటుంచితే అధికారులకు

మిగతా 8వ పేజీలో...

నాణ్యత లేకుంటే బిల్లులివ్వం



అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే బిల్లులు ఇవ్వం. సీసీ రోడ్లన్నీ ఎస్‌డీఎఫ్ కింద జరుగుతున్నాయి. వాటిని పీఆర్ వాళ్లు రికార్డు చేస్తున్నారు. నాణ్యతలేని పనులకు బిల్లులు ఇవ్వకూడదని కలెక్టర్‌కు రాశాను. దీంతో కొన్ని పనుల పేమేంట్ నిలిచిపోయింది. రూ.25 కోట్ల నిధులకు సంబంధించి టెండర్లు జరుగుతున్నాయి. ఈ నిధులతో కొత్తగా వెలసిన కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మిస్తాం.

-వెంకటయ్య,
మున్సిపల్ కమిషనర్, పరిగి

వర్షాలు కురవాలని
కప్పకావిడి

మర్పల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభంలో మురిపించిన వరుణుడు ప్రస్తుతం ముఖం చాటేశాడు. దీంతో విత్తనాలు విత్తేందుకు అన్నదాతలు ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. పలువురు రైతులు విత్తనాలు వేశామని, వర్షాల జాడ లేక మొలకలు వాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలు కురవాలని దేవుళ్లను వేడుకుంటూ శనివారం మర్పల్లి మండల కేంద్రంలో మహిళలు కప్పకావిడి నిర్వహించారు. రోకలిబండకు మధ్యలో కప్పలను ఉంచి ఇంటింటికీ తిరుగుతూ వాటిపై నీరు పోస్తూ ఊరేగిస్తూ వర్షాలు కురిపించాలని దేవుళ్లను వేడుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అంధుల ఆశ్రమ పాఠశాలలో అర్హులైన విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాములు సూచించారు. మహబూబ్‌నగర్‌లోని రాష్ట్ర స్థాయి అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు ఉండి 40 శాతం అంధత్వం కలిగిన విద్యార్థులు అర్హులని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, దుస్తులు అందిస్తామని పేర్కొన్నారు. ప్రవేశాలకు సంబంధించి మహబూబ్‌నగర్ పిల్లల మర్రి రోడ్డులోని పాఠశాలలను సంప్రదించాలన్నారు. వివరాలకు 9618243794 నంబర్‌లో సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మిగిలింది రెండు రోజులే

రేపటి వరకు రేషన్ బియ్యం పంపిణీ

- మేడ్చల్ జిల్లాలో ఇప్పటికే 90 శాతం పైగా పూర్తి
- జూలై 5వరకు గడువు పెంపునకు అవకాశం!


రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారుల క్యూ

పంపిణీ చేయాల్సిన కోటా
34,535 మెట్రిక్ టన్నులు
మొత్తం కార్డులు 5,37,805
యూనిట్లు 18,61,6358

మేడ్చల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. జూన్ 1 నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. కాగా, బియ్యం పంపిణీ కి కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు పోటెత్తుతున్నారు. సకాలంలో కోటా అందక వారం రోజులు పంపిణీ నిలిపివేసినప్పటికీ నాలుగు రోజులుగా పంపిణీ జోరందుకుంది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తం 618 రేషన్ దుకాణాలున్నాయి. వీటి పరిధిలో 5,37,805 రేషన్ కార్డులున్నాయి. వారందరికీ మూడు నెలలకు సరిపడా బియ్యం పంపిణీ చేసేందుకు 34,535 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. ఇప్పటి వరకు 90 శాతానికి పైగా 30 వేల మెట్రిక్ టన్నులకు పైగా

మిగతా 8వ పేజీలో...

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు పదోన్నతి



వికారాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.లింగ్యానాయక్‌కు పదోన్నతి లభించింది. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన లింగ్యానాయక్ అదనపు కలెక్టర్ హోదాలోనే ఇక్కడ విధులు నిర్వహించనున్నారు. ఏడాది కిందట ఇక్కడ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఇక్కడే స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతి లభించిన ఆయనకు ఆర్డీవో వసుచంద్ర, రెవెన్యూ, వివిధ శాఖ జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు అభినందనలు తెలిపారు.

1,810 భూ సమస్యల పరిష్కారానికి నోటీసులు

మేడ్చల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ భూభారతి(నూతన ఆర్వోఆర్) చట్టం అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించిన విషయం తెలిసిందే. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 2,845 భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు రాగా అందగా అందులో ఇప్పటి వరకు 1,810 సమస్యల పరిష్కారానికి సంబంధించి అధికారులు నోటీసులు జారీ చేశారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు బృందాలుగా ఏర్పడి దరఖాస్తుల పరిశీలన చేస్తూ నోటీసులు జారీ చేస్తున్నారు. ఇందులో 11 దరఖాస్తులను అప్రూవ్ చేయగా, 6 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. కాగా, జిల్లాలో 5 మండలాల్లోని 81 గ్రామాల్లో 3 నుంచి 19వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం దరఖాస్తుల్లో మిస్సింగ్ సర్వే నంబర్‌లకు సంబంధించినవే 752 రావడం గమనార్హం.


దరఖాస్తులు పరిశీలిస్తున్న విజయేందర్‌రెడ్డి(ఫైల్)

ఆగస్టు 15లోగా పరిష్కారం

రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను పరిశీలించి, ఆ దరఖాస్తు ఏ విభాగంలోకి వస్తుందో నిర్ణయించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15వ తేదీలోగా పరిష్కరిస్తాం. ఇంకా ఎవరికైన భూ సమస్యలు ఉంటే మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

-విజయేందర్‌రెడ్డి,
అదనపు కలెక్టర్, మేడ్చల్

యాదవులను అవమానించిన వారిని శిక్షించాలి

» జాతీయ బీసీ సంఘం కార్యదర్శి బీరయ్య యాదవ్

మోమిన్‌పేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ఇటావా జిల్లాలోని దాదాపూర్ గ్రామంలో యాదవ కులస్తులను హింసించిన వారిని కఠినంగా శిక్షించాలని జాతీయ బీసీ సంఘం కార్యదర్శి బీరయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గొల్ల కురుమ యాదవులు ఒగ్గు కళారుల డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ర్యాలీగా పాత బస్టాండ్ వరకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులను హింసించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. సనాతన ధర్మం భ్రష్టు పట్టించేందుకు బ్రాహ్మణులే కారణం అని ఆరోపించారు. ఇప్పటికైనా హిందు సమాజం మేల్కొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, మానయ్య, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు యాదగిరి యాదవ్, నాయకులు సాయిలుయాదవ్, రాజశేఖర్, చంద్రయ్య, పెద్ద గొల్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాతీయ బీసీ సంఘం కార్యదర్శి బీరయ్య యాదవ్

పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి,జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు సాముచిత స్థానం కల్పిస్తామని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో పార్టీ, నామినెటెడ్ పదవుల భర్తీకి కార్యకర్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులు, మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకునే విధంగా పని చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శేటి నరేందర్, ఏఎంసీ చైర్మన్ పరుశరాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.హన్మంత్, పరిగి పట్టణ అధ్యక్షుడు కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతం పరిగి మండలం సయ్యద్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

కబ్జాకు యత్నిస్తే కఠిన చర్యలు


భూ కబ్జాకు యత్నిస్తుండగా అధికారులు పట్టుకున్న ట్రాక్టర్


బషీరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అడవుల్లో చెట్లను నరికి, భూ కబ్జాలకు యత్నిస్తే ఎవరిని ఉపేక్షించబోమని బషీరాబాద్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి స్నేహశ్రీ హెచ్చరించారు. మైల్వార్ రిజర్వు ఫారెస్టులో సమీప తండా గిరిజనులు చెట్లను నరికి, భూ కబ్జా చేసి ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా శుక్రవారం అటవీశాఖ అధికారులు స్నేహశ్రీ, మమత, పీర్యానాయక్, మల్లప్ప వారిని అడ్డుకున్నారు. అటవీ ప్రాంతంలో ఇరుక్కున్న ట్రాక్టర్ బయటకు వెళ్లే మార్గం లేక టైర్లలో గాలి తీసి అక్కడే ఉంచి వెళ్లారు. శనివారం ఉదయం ట్రాక్టర్ స్వాధీనం కోసం వెళ్లగా అక్కడ కనిపించకపోవడంతో ఫారెస్టు అధికారులు అవాక్కయ్యారు. ఈ విషయం సీరియస్‌గా తీసుకున్నా సెక్షన్ అధికారి మైల్వార్ గ్రామ పరిసరాలు, గిరిజన తండాల్లో ట్రాక్టర్ కోసం వెతికారు. ట్రాక్టరు ఆచుకీ లభ్యం కాకపోవడంతో యజమాని ఇంటి జాడ తెలుసుకొని కుటుంబ సభ్యులను కలిసి ఆరా తీశారు. ట్రాక్టర్ ఎక్కడుందని ప్రశ్నించగా, తెలియదని చెప్పడంతో వారిని హెచ్చరించారు. ట్రాక్టర్ ఎక్కడున్నా సాయంత్రం వరకు తాండూరు అటవీ శాఖ కార్యాలయానికి తీసుకురావాలని లేదంటే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- సోలార్ వైరుకు కాలు తగలడంతో ప్రమాదం
- కోట్‌పల్లి మండలం
- బార్వాద్ గ్రామంలో దుర్ఘటన

7







పరిసరాల పరిశుభ్రతకు

పట్టణ ప్రజలు సహకరించాలి



శంకర్‌పల్లిలో చెత్త తొలగించిన చోట ముగ్గులు వేసిన పారిశుధ్య సిబ్బంది

శంకర్‌పల్లి,జూన్28(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ యోగేష్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని హనుమాన్ కాలనీ ఎదురుగా, బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద ఉన్న చెత్తను తొలిగించి పారిశుద్య సిబ్బందితో శనివారం ముగ్గులు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, తడిపొడి చెత్తను వేరు చేసి చెత్త బండ్లలోనే వేయాలని ఆయన సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. డెంగ్యూ, మలేరియా, బోధకాల వంటి రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ శంకర్‌పల్లిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గ్రామాభివృద్ధికి కృషి

షాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం కోసం రూ.2లక్షల నగదును శనివారం గ్రామస్తులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, యాదయ్య, అనంతయ్యగౌడ్, నర్సింహులు, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మన్‌మర్రి గ్రామస్తులతో మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి

మున్సిపాలిటీకి పారిశుధ్యం పట్టదా?



మురుగు నీటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని ఈశ్వర్‌కాలనీలో మురుగు నీటి సమస్యపై మున్సిపాలిటీ పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్ చౌరస్తా నుంచి సోలిపూర్ వై జంక్షన్ వరకు విస్తరించిన రోడ్డుకు ఇరువైపుల మురుగు నీటి కాలువలను నిర్మించారు. సాయిబాబాకాలనీ కమాన్ ఎదురుగా ఉన్న ఈశ్వర్‌కాలనీకి వెళ్లే రోడ్డులో కాలనీ నుంచి వచ్చే మురుగునీటికి కాలువను ఎత్తులో నిర్మించారు. దాంతో కాలనీ నుంచి వస్తున్న మురుగు నీరు చేరి రోడ్డుపక్కన కుంటలా మారింది. స్థానికులకు దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమల బెడద ఎక్కువైంది. కాలనీ వాసుల ఆవేదనతో శనివారం నర్సింహులు వచ్చి పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందికి ఫోన్‌చేసి, రప్పించి, పరిస్థితిని వివరించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.



ప్లాట్ల కబ్జాకు యత్నం

● 9 ప్లాట్లకు అక్రమంగా ఫెన్సింగ్ వేసిన రియల్టర్

ఆదిభట్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి):ఆదిభట్ల పరిధి ఎంపీపటేల్‌గూడలోని శ్రీఅంజలి టౌన్ షిప్‌లో 9ప్లాట్ల కబ్జాకు గుర్తుతెలియని రియల్టర్ యత్నిస్తున్నాడని ప్లాట్స్ ఓనర్స్ అసోషియన్ సభ్యులు వాపోయారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంపీపటేల్‌గూడలో సర్వే నంబర్లు 532, 556, 557లలో 26ఎకరాల్లో 2003లో శ్రీఅంజలి టౌన్‌షిప్ వెంచర్‌లో 272ప్లాట్లు చేశారు. వీటిల్లో ఎక్కువ శాతం హైదరాబాద్‌కు చెందని వారు ప్లాట్లను కొన్నారు. ఇదిలా ఉంటే గుర్తు తెలియని వ్యక్తులు వెంచర్‌లోని 9ప్లాట్లకు చుట్టు కడీలు పాతి ఫెన్సింగ్ వేశారు. విషయం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు శనివారం కడీలను పెకిలించేశారు. ఈ సందర్భంగా టౌన్షిప్ సభ్యులు బాల్‌రెడ్డి, సీతారాంరెడ్డి, శాయిలేశ్‌లు మాట్లాడుతూ.. తాము 2003లో ప్లాట్లను కొన్నామన్నారు. తమ ప్లాట్లను ఈ మధ్య కాలంలో ఎవరో రియల్టర్ ప్లాట్ల నంబర్లు(167 నుంచి 176) వరకు కబ్జాచేసి ఫెన్సింగ్ వేశారని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అసోసియేషన్ సభ్యులంతా కలిసి వచ్చి అక్రమంగా పాతిన కడీలను, ఫెన్సింగ్‌ను తొలగించామన్నారు. ప్లాట్ల కబ్జాపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్లాట్ల ఓనర్లు పాల్గొన్నారు.



ప్లాట్లకు వేసిన కడీలను తొలగిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

● వైఆర్పీ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ యెలిశాల రవిప్రసాద్



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో యెలిశాల రవిప్రసాద్ తదితరులు

ఇబ్రహీంపట్నం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కేవలం ఉద్యోగులుగా గాకుండా విద్యార్థులు పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని వైఆర్పీ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ యెలిశాల రవిప్రసాద్ అన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని వైఆర్పీ ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ తరపున శనివారం 30మంది పేద విద్యార్థులకు రూ.8.15లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఎంబీబీఎస్, ఇంజినీరింగ్, హైస్కూల్, ప్రైమరీ చదువుల కోసం పేద విద్యార్థులకు చేయూతనివ్వాలనే ఉద్దేశ్యంతో ఈ స్కాలర్‌సిప్‌లు అందజేస్తున్నట్లు రవిప్రసాద్ తెలిపారు. మార్పు కోసం అన్నింటికంటే శక్తిమంతమైంది విద్యేనని ఆయన అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన, ఆలయాల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా ఎనిమిదేళ్లుగా ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు 250 మందికి పైగా విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో వైఆర్పీ ఫౌండేషన్ నిర్వాహకులు యెలిశాల హేమచంద్ర, శరత్‌చంద్ర, యామ దయాకర్, ఆడెళ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈరనాగమ్మ ఆలయ నిర్మాణానికి

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి రూ.లక్ష విరాళం



ఈరనాగమ్మ గుడి నిర్మాణానికి విరాళం అందిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

కేశంపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కొండారెడ్డిపల్లిలో నిర్మించ తలపెట్టిన ఈరనాగమ్మ గుడికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి విరాళం అందించారు. షాద్‌నగర్‌లోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో శనివారం రూ.లక్షను ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గుడులతో గ్రామాల్లో ప్రశాంత వాతవరణం నెలకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని కలిగి ఉండాలన్నారు. విరాళమిచ్చిన ఎమ్మెల్సీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు, బీఆర్ఎస్ నాయకులు యారం శేఖర్‌రెడ్డి, దినేశ్‌సాగర్, మధు, కర్ణకోట నరేందర్, మల్లేశ్‌యాదవ్, ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని హారికతో ప్రిన్సిపాల్ డీపీ.నరేశ్‌రాజ్

కొడంగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జాతీయ సెమ్స్ ఒలింపియాడ్ పరీక్షలో నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటాడని ప్రిన్సిపాల్ డీపీ.నరేశ్‌రాజ్ తెలిపారు. జాతీయ సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ మార్చిలో నిర్వహించిన పరీక్షలో తమ పాఠశాల విద్యార్థి హారిక రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సెమ్స్ ఫౌండేషన్ డైరెక్టర్ రామ్‌చందర్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎస్.రెడ్డి హారికకు ప్రావీణ్య పురస్కార్, మెమొంటో, మెడల్, శాలువాతో సన్మానించి అభినందించినట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ డీపీ.నరేశ్‌రాజ్, ఉపాధ్యాయులు హారికను అభినందించారు.



నేడు సాయిచంద్ విగ్రహావిష్కరణ

తాండూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా అమరచింతలో ఈ నెల 29న(నేడు) నిర్వహించనున్న కళాకారుడు సాయిచంద్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తూర్ బాలు, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు పిలుపునిచ్చారు. కవులు, గాయకులు, ప్రజాస్వామికవాదులు పాల్గొనాలని కోరారు. బడుగుల్లో సాంస్కృతిక సునామీ సృష్టించిన సాయిచంద్‌కు కళాకారులు నివాళులర్పించాలని కోరారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీస్

బషీరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జూలై 9న దేశ వ్యాప్త సమ్మె చేపట్టనున్నందున ఎంపీడీవో కార్యాలయ సూపరిటెండెంట్ విజయకుమారికి సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ కార్మికులు నోటిసను అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్ మట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికుల రెండు నెలలుగా వేతనాలు రాక దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కార్మికులందరూ ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమంలో బషీరాబాద్ మండలాధ్యక్షులు శామప్ప, కార్మికులు చందు, భాస్కార్, లక్ష్మి, జగ్గమ్మ, భీమమ్మ, మొగులప్ప పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మర్పల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు యు.రవీందర్ అన్నారు. మర్పల్లి మండలంలోని బూచన్‌పల్లిలో శనివారం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్దిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎల్.ప్రభాకర్‌రెడ్డి, పి.నరసింహారెడ్డి, టి.రాములు, కె.బాబు, కె.గోపాల్, బి.రంగయ్య, బి.రాజు, బి.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రెడ్డి జేఏసీ నాయకులు

రెడ్డి కార్పొరేషన్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి

ఆమనగల్లు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని రెడ్డి జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జేఏసీ కో-చైర్మన్ హరినాథ్‌రెడ్డి, ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు పెండ్యాల రాంరెడ్డిలతో కలిసి శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చామని లిక్కి శ్రీనివాస్‌రెడ్డి, అనురుద్రారెడ్డి తెలిపారు. రెడ్డి కార్పొరేషన్‌కు ఏటా రూ.2వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలని, హైదరాబాద్‌లో రెడ్డి సంక్షేమ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించి భవనం నిర్మించాలని వినతి పత్రంలో కోరారు. ఇందుకు వేం నరేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి సీఎం దృష్టికి తీసుకుపోతానని హామి ఇచ్చినట్లు వారు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జేఏసీ నాయకులు నర్సింహారెడ్డి, డీకే.వసంత్, గోవర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, ఎల్లా రెడ్డి, రవీందర్‌రెడ్డి, పుష్పలత, కృష్ణారెడ్డి, రాధిక, నాగమణి, రజిత ఉన్నారు.



రాంకీ సంస్థకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఆద్రాస్‌పల్లి గ్రామస్తులు

ఎన్జీటీ ఉత్తర్వులు 'రాంకీ' బేఖాతర్

» కాలుష్యానికి కారకం అవుతోందని గ్రామస్తుల ఆందోళన

కీసర, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఉతర్వులను బేఖాతారు చేస్తున్న రాంకీ డంపింగ్ యార్డ్ సంస్థపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి ఆద్రాస్‌పల్లి వాసులు శనివారం ఆందోళన చేశారు. డంప్ యార్డ్ నుంచి చెత్త బయటకు రాకుండా రాంకీ సంస్థ ట్యాపింగ్ చేయాలని, వ్యర్థ జలాలను పైప్‌లైన్ ద్వారా దూర ప్రాంతానికి తరలించాలన్నారు. అలాగే చుట్టుపక్కల గ్రామాలకు సీఎస్ఆర్ నిధులతో శుద్ధమైన నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు తెలిపారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా రాంకీ సంస్థ నిబంధనలు తుంగల్లో తొక్కి స్థానికంగా కాలుష్యానికి కారకం అవుతోందని ఆగ్రహంతో చేసి రోడ్డుపై ఆందోళన చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులొచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. చివరకు గ్రామస్తులు రాంకీ సంస్థపై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు.



విద్యార్థులకు నోటు బుక్కులు అందజేస్తున్న ఏసీపీ అంజయ్య

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

చేవెళ్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని చదువులో రాణిస్తే ఉజ్వల భవిషత్తు ఉంటుందని రాచకొండ ఏసీపీ(ఎస్వోటీ) అంజయ్య అన్నారు. శనివారం కౌకుంట్ల పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్కులు, స్టేషనరీ అందజేశారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ... చిన్నతనంలో పేదరికాన్ని అను భవించిన తాను క్రమశిక్షణ, లక్ష్యంతో చదువుకున్నానని చెప్పారు. అందుకే నేడు మచి స్థాయిలో ఉన్నానన్నారు. తాను పుట్టి పెరిగిన గ్రామ విద్యార్థులకు ఎంతో కొంత సహాయం చేయాలనే గ్రామాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు శివకుమార్, మొగులయ్య, కృష్ణ, మహేశ్, రమేశ్, ప్రశాంత్, కరణ్‌జీ, శ్రీకాంత్, కరుణాకర్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



పుల్ల స్రవంతికి పట్టా అందజేస్తున్న సాత్వికరెడ్డి

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి

మొయినాబాద్ రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధితో పాటు పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, డైరెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధి హిమాయత్‌నగర్‌లో గల చైతన్య డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన పుల్ల స్రవంతి ఫార్మసీ విభాగంలో 'డిజైన్ ఇన్విట్రో అండ్ ఇన్వివో ఎవల్యూషన్ ఆఫ్ కాల్షియం' అనే అంశంపై కంజర్ల నరసింహ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. దీంతో ఆమెకు పీహెచ్‌డీ వచ్చింది. శనివారం స్రవంతికి వర్సిటీ డైరెక్టర్ అండ్ పాలనాధికారి సాత్వికరెడ్డి యూనివర్సిటీలో పట్టాను ప్రదానం చేశారు. పరిశోధనపై విద్యార్థులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆమె చెప్పారు. ఫార్మసీ విభాగంలో పరిశోధన చేయడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీందర్, డీన్ క్రిస్టాఫర్, రాజేందర్‌రెడ్డి, శంకరయ్య, జగదీష్, కుమారస్వామి, డేనియాల్, సరిత, అసిస్టెంట్ పీఆర్వో గాదె రాంబాబు పాల్గొన్నారు.



కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సాయుధ బలగాల ఫ్లాగ్‌మార్చ్

కొడంగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం కొడంగల్‌లో సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి సాయుధ బలగాలు, పోలీసు సిబ్బంది సంయుక్తంగా కొడంగల్ మున్సిపాలిటీ, మండల పరిధి హస్నాబాద్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ జీవీ.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

5వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

షాద్‌నగర్ రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు పెంచాలని చర్యలు తీసుకుంటోందని, 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 5వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించిందని షాద్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకులు రమాదేవి తెలిపారు. మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌లో భాగంగా శనివారం ఫరూఖ్‌నగర్ మండలం రాసుమల్లగూడలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుకు రాయితీలతో ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్వహణకు రంగారెడ్డి జిల్లాను వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి



ఆయిల్ పామ్ మొక్క నాటుతున్న ఏడీఏ రమాదేవి, రైతులు

కేటాయించారని తెలిపారు. గత రెండేళ్లలో జిల్లాలో 635 మంది రైతుల 2,141ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటారని తెలిపారు. కొత్తగా 555 మంది రైతులు 1,951 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. వీరిలో 1,259 మంది రైతులకు అనుమతి మంజూరు చేశామని చెప్పారు. శనివారం ఒక్క రోజే 19 మండలాల్లో 85 గ్రామాల్లో 154 మంది రైతుల 557 ఎకరాల్లో మొక్కలు నాటామని వివరించారు. మొక్కలకు డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేశామని చెప్పారు. ఫరూఖ్‌నగర్ మండలంలో 50.5 ఎకరాల్లో మొక్కలు నాటామని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారిణి హిమబిందు, వ్యవసాయ అధికారి నిషాంత్ కుమార్, ఏఈఓలు తేజా, ఆయిల్ పామ్ అధికారి మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టమాట.. లాభాల పంట

అన్ని కాలాల్లో వేసుకునే కాయగూర పంట

» అందుబాటులో మార్కెటింగ్ సౌకర్యం

» నష్టభయాలూ తక్కువే

» సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు



మార్కెట్‌కు తరలించేందుకు బాక్సుల్లో నింపిన టమాట

మంచాల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టమాట పంటను సంవత్సరం పొడవునా సాగు చేయొచ్చు. ఈ పంటతో ఏ కొన్ని సందర్భాల్లో తప్పితే రైతులు నష్టపోవడం ఉండదు. మిగతా కూరగాయల్తో పోలిస్తే ప్రజలు ఎక్కువగా వినియోగించేది టమాట. అందుకే ఏడాదిలో ఎక్కువ కాలం ఈ పంటకు సాధారణం, అంతకంటే ఎక్కువ ధరే ఉంటుంది. ఈ కారణంగా రైతులకు కనీస లాభాలొస్తాయి. జాపాల, అరుట్ల, అస్మత్‌పూర్, బండలేమూర్ తదితర గ్రామాల్లో టమాటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ పంట లాభదాయకంగా ఉంటూ, నష్టభయాలు తక్కువ ఉండడం వల్లే రైతులు దీని సాగుకు మొగ్గు చూపుతున్నారు. మార్కెటింగ్ సౌకర్యంతో రవాణా ఖర్చులూ తక్కువే. డ్రిప్, మల్చింగ్ విధానంతో తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో పంట పండించుకోవచ్చు. ఆధునిక విధానంలో సాగుతో దిగుబడులూ పెరుగుతాయి. టమాట సాగుకు నీరు ఇంకే గరప నేలలు అనుకూలంగా ఉంటాయి. శీతాకాలంలో ఇసుక భూముల్లో పంట దిగుబడి ఎక్కువ. చౌడు భూములు ఈ పంటకు అనుకూలం కాదు. మేలురకం విత్తనాలతో పంట దిగుబడి ఎక్కువ. ప్రస్తుతం సిరి, లైకో, అన్నపూర్ణ, లక్ష్మి తదితర హైబ్రీడ్ వంగడాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

నారు పోసి నాటే సమయం..

టమాట నారు మడికి త్వరగా నీరు ఇంకే భూమిని ఎంచుకోవాలి. విత్తనాలు, మొలిచే నారు కుళ్లకుండా లీటర్ నీటిలో 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ వేసి నారు మడిని శుద్ధి చేయాలి. నారు మడిలో సాలుకు సాలుకు 10సెంటీ మీటర్ల దూరం ఉండేలా విత్తనాలను పలుచగా చల్లుకోవాలి. అలాగే కొన్ని నర్సరీల్లోనూ నారు అమ్ముతున్నారు. అయితే విత్తన నాణ్యత చెక్ చేసుకున్నాకే నారు కొనాలి. విత్తనాలు చల్లిన 20 నుంచి 25 రోజుల నారును నాటుకోవాలి. జూన్-జూలైలో, డిసెంబర్-జనవరి, ఫ్రిబవరి-ఏప్రిల్ నెలల మధ్య టమాట నాటుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం ఇలా...

చివరి దుక్కిలో ప్రతీ ఎకరానికి 6-8 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. నాటే సమయంలో 24కిలోల భాస్వరం, 24కిలోల పొటాష్ ఎరువులు వేయాలి. 48-60 కిలోల నత్రజని ఎరువును సమపాళ్లుగా వేయాలి. పూత దశలో 8-12కిలోల బోరాక్స్ చల్లితే పండ్లు పగలవు. నారునాటే ముందు దుక్కిలో ఆక్సీఫ్లోరోఫిన్ మందును లీటర్‌కు 200మిల్లీ లీటర్ల చొప్పున పిచికారి చేయాలి. భూమిలో తేమను బట్టి 7-10రోజుల వ్యవధిలో నీరు కట్టాలి. కాయలు నేలకు తాకకుండా టమాల మొక్కలను కర్రలకు కట్టాలి. ఇలా చేస్తే గాలి ఎక్కువ సోకి పూత, కాత ఎక్కువ వస్తుంది. అలాగే కాయలు నేలకు తగలవు, కుళ్లవు.

తెగుళ్లు.. సస్యరక్షణ

టమాట పంటకు నారు కుళ్లు, ఆకు ముడత వంటి తెగుళ్లు ఎక్కువగా వస్తాయి. రోగం వచ్చిన వెంటనే పంటకు ఎండోసల్ఫాన్ మందును లీటర్ నీటికి 2మిల్లీలీటర్ల చొప్పున పిచికారి చేయాలి. పొలంలో పక్షి స్థావరాలను ఏర్పాటు చేస్తే పంటను కీటకాల నుంచి కాపాడవచ్చు.

యేటా టమాట సాగు చేస్త



నేను ప్రతియేటా మిగతా పంటలతో పాటు టమాటనూ సాగు చేస్త. అన్ని పంటల కంటే నాకు టమాట సాగే లాభదాయకంగా ఉంది. కూలీలు రాకపోయినా ఇంటి మనుషులమే టమాటల్ని తెంపి మార్కెట్‌కు తరలించుకుంటాం. దిగుబడి బాగానే ఉంది. ఈ పంటతో నష్టభయం కూడా తక్కువ. కాకపోతే మార్కెట్‌కు ఎక్కువగా టమాట వస్తే మాత్రం ధర తక్కువ ఉంటుంది. ఇదొక్కటే సమస్య.

- అనిరెడ్డి మహిపాల్‌రెడ్డి, రైతు, మంచాల

విద్యుదాఘాతంతో రైతు మృతి



మహేందర్‌రెడ్డి(ఫైల్)

కోట్‌పల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బార్వాద్‌కు చెందిన పట్లోళ్ల మహేందర్‌రెడ్డి(57) తన ఎనిమిదెకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలంలో ఉన్న సోలార్ తీగలపై విద్యుత్ స్తంభం నుంచి బోరు మోటార్‌కు వెళ్లే సర్వీస్ వైర్ తీగ పడింది. రైతు గమనించలేదు. కాలికి సోలార్ వైరు తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మహేందర్‌రెడ్డికి కూతురు, కుమారుడు ఉన్నారు. అతడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శైలజ తెలిపారు.



పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

భూ కబ్జాకు యత్నం.. కేసు నమోదు

మొయినాబాద్ రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన మండలంలోని శివారు తోలుకట్టలో చోటుచేసుకుంది. సర్కారు భూమి కబ్జా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. వివరాల్లోకి వెళ్తే.. తోలుకట్టలోని సర్వే నంబర్ 510లో రూ.15కోట్ల విలువైన మూడెకరాల ప్రభుత్వ భూమికి హైదరాబాద్‌కు చెందిన ఇబ్రహీం ఫెన్సింగ్, ప్రీకాస్ట్‌తో గదుల నిర్మాణానికి పూనుకున్నాడు. శనివారం తహసీల్దార్ అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఇబ్రహీం అడ్డుకోగా తహసీల్దార్ అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిలో సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. అసైన్డ్ భూమి అమ్మినా, కొన్నా పీవోటీ చట్టాన్ని ప్రయోగిస్తామని హెచ్చరించారు. అధికారులు రాజేష్, మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రగతి కాంతులు

ఆమనగల్లు, జూన్28(ఆంధ్రజ్యోతి): గ్రామాల, వ్యవసాయ రంగం అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 18నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని అన్నారు. ఖానాపూర్, గౌరిపల్లి గ్రామాల్లో సీడీఎఫ్ రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం ఎమ్మెల్యే, ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, ప్యాక్స్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్‌లు ప్రారంభించారు. అనంతరం పర్యటించారు. జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ- పల్లెల్లో మౌలిక వసతులు కల్పించాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఖానాపూర్‌కు మహర్దశ వచ్చిందన్నారు. రూ.200కోట్లతో 25ఎకరాల్లో యంగ్ ఇండియా పాఠశాల నిర్మిస్తామని పేర్కొన్నారు. తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో రూ. 200కోట్లతో 650 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, 8 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో రూ.600కోట్లతో గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.నర్సింహ, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాములు, కాంగ్రెస్ జిల్లా, మండలాల నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, కాడెమోని శ్రీశైలం, జి.గణేశ్, డోకూరు ప్రభాకర్ రెడ్డి, బిక్యానాయక్, భగవాన్‌రెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, దశరథరామ్ రెడ్డి, షాబుద్దీన్, చేగూరి వెంకటేశ్, కృష్ణ, శ్రీశైలం, బాబ, శ్రీకాంత్, అలీం, శ్రీశైలం, తాళ్ల రవీందర్, సురేందర్‌రెడ్డి, ఫరీద్, బిచ్యానాయక్, ఆరిఫ్, బాల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, రాంరెడ్డి, పాల్గొన్నారు.



హైమాస్ట్ లైట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

నేటి నుంచి ఎస్పీఎల్



షాబాద్ పీఆర్ఆర్ మినీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

షాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలోఆదివారం(నేటి) నుంచి వారం రోజుల పాటు షాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ట్రస్ట్ చైర్మన్ ఎలుగంటి అభిరామ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ తెలిపారు. శనివారం షాబాద్‌లోని పీఆర్ఆర్ మినీ స్టేడియాన్ని పరిశీలించారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎస్పీఎల్ క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. క్రీడాప్రాంగణాన్ని సిద్ధం చేశామన్నారు. క్రికెట్ పోటీల్లో విజేతకు రూ.లక్ష, రన్నర్స్‌కు రూ.50వేలు, మూడో బహుమతి రూ.25వేలు, నాల్గో బహుమతి రూ.15వేల చొప్పున అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అశోక్, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ సంజీవరెడ్డి, నాయకులు సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, రాహుల్‌గుప్తా, జానీ, ఆంజనేయులు, సదానందం, సత్యంయాదవ్, సందీప్, రమేష్ తదితులు పాల్గొన్నారు.

దేశ రక్షణకు విద్యార్థులను తీర్చిదిద్దాలి

» గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

» స్వామి నారాయణ గురుకులంలో ముగిసిన ఇన్వెస్టిచర్

మొయినాబాద్ రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భారత్‌ను విశ్వగురువుగా చేసింది ప్రధాని మోదీ అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పారు. విద్యార్థులను విద్యలో తీర్చిదిద్దడంతో పాటు దేశరక్షణలోనూ పాల్గొనేలా తయారు చేయాలని అన్నారు. మొయినాబాద్ మునిసిపల్ పరిధి ఎన్కేపల్లిలో స్వామి నారాయణ్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రెండు రోజుల పాటు జరిగే పరిచయ కార్యక్రమం(ఇన్వెస్టిచర్) శనివారం ముగిసింది. హాస్టల్ వివిధ విభాగాల పర్యవేక్షణకు విద్యార్థుల ఎంపిక కోసం నిర్వహకులు ఎన్నికలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. కుల, మత, వర్ణ, బేధాలు లేకుండా ఎన్నికలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఇంతటి పాఠశాల మన ప్రాంతంలో ఉండడం ఆనందదాయకం అన్నారు. విద్యార్థి దశ నుంచే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకుంటూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని, దేశం మెచ్చేలా విద్యార్థులు తయారు కావాలన్నారు. నైతికంగా, శరీరకంగా, బలంగా ఉండాలని సూచించారు. స్వామినారాయణ్ గురుకుల్‌లో విద్య, సంస్కృతి సంప్రదాయాలు నేర్పడం అభినందనీయన్నారు. స్వామీజీలు హరివల్లభ్ దాస్, గుణప్రియ, సద్గుర, సుఖ్‌వల్లభ్‌లు ఆధ్యాత్మిక సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో డిగ్రీ హాస్టల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ శేషుబాబు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం గురుకుల్ స్వామీజీలు రాజాసింగ్‌కు జ్ఞాపికతో సత్కరించారు.



రాజాసింగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న స్వామిజీలు

దయనీయం

● తరలింపు వాహనాల్లేక వ్యర్థాలను భుజాన మోసిన కార్మికులు

వికారాబాద్ మునిసిపాలిటీ దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతోందనేందుకు నిలువెత్తు నిదర్శనం ఈ చిత్రం. పారిశుధ్య సేకరణకు ఉపయోగించే ట్రాక్టర్లు, ఆటోలు సరిగ్గా లేక కాలనీల్లో జమైన చెత్తను కార్మికులు ఓ సంచిలో వేసుకొని భుజాలపై ఎత్తుతున్నారు. పట్టణంలోని బీటీఎస్ కాలనీలో కన్పించిందీ దృశ్యం. మునిసిపాలిటీకి ప్రత్యేక నిధులు లేక, వచ్చే సాధారణ నిధులనూ అధికారులు స్వార్థ ప్రయోజనాలకు వినియోగించడంతో కార్మికుల రోజువారీ విధులకు సౌకర్యాలను చేకూర్చడం లేదు.

- వికారాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి)



బీటీఎస్ కాలనీలో భుజాలపై చెత్తను తీసుకెళుతున్న మునిసిపల్ కార్మికులు

భూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

● కులకచర్ల తహసీల్దార్ మనోహరచక్రవర్తి

ఫేస్ టు ఫేస్



కులకచర్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ మనోహరచక్రవర్తి అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో రెవెన్యూ శాఖకు సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు.

ఆంధ్రజ్యోతి: 'భూభారతి'లో వచ్చిన దరఖాస్తులు?

తహసీల్దార్: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో కులకచర్ల మండల వ్యాప్తంగా 16 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 1,424 దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి: ఎప్పటిలోగా పరిష్కరిస్తారు?

తహసీల్దార్: ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. ఆగస్టు 15లోపు పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: అల్మాస్కాన్‌పేట్ భూములపై తీసుకుంటున్న చర్యలు?

తహసీల్దార్: అల్మాస్కాన్‌పేట్ పరిధిలో మొత్తం 975ఎకరాల భూమి ఉండగా అందులో కలెక్టర్ ఆదేశాలతో కాస్తులో ఉన్న రైతుల భూమి 794ఎకరాలు సర్వేచేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: మండలంలోని ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలు?

తహసీల్దార్: మండల వ్యాప్తంగా 330ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించగా రైతుల నుంచి పలు సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన మాజీ చైర్‌పర్సన్



మున్సిపల్ కమిషనర్‌తో మాజీ చైర్‌పర్సన్ మర్రి దీపిక

మేడ్చల్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చంద్ర ప్రకాష్‌ను మేడ్చల్ మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి శనివారం మర్యాద పూరకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను శాలువా కప్పి సన్మానించారు. మాజీ చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది కమిషనర్‌ను కలిశారు. మేడ్చల్ పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఈ విజయలక్ష్మి, మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి, కాంగ్రెస్ నాయకుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కోర్టు పరిసరాల అభివృద్ధికి నిధులివ్వాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న న్యాయవాదులు

పరిగి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని జూనియర్ సివిల్ కోర్టు పరిసరాల్లో అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరుతూ పరిగి న్యాయవాదులు శనివారం హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవాస్తవ కాటకు వినతిపత్రాన్ని అందజేశారు. కోర్టు ఆవరణలో అభివృద్ధితోపాటు, గ్రీనరీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు జి.కృష్ణారెడ్డి, న్యాయవాదులు బి.లింగం, రాంచందర్, వెంకట్‌రాంలు, ఇబ్రహింఖాన్, గోపాల్, ఖైసర్‌పాషా ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు



ఎమ్మెల్యేకు ఫోన్‌లో ప్రొసీడింగ్ చూపిస్తున్న గుల్షన్

కొడంగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ బహదూరపూర ఎమ్మెల్యే మొహ్మద్ ముబీన్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొడంగల్ పట్టణంలో శిథిలావస్థలో ఉన్న షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవలే రూ.2కోట్ల 50లక్షలు ప్రొసిడింగ్ విడుదల చేసిందని తెలిపారు. నిధులు మంజూరైనా నేటి వరకు పనులు చేపట్టలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే అక్బరుద్దీన్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే మొహ్మద్ ముబీన్ తెలిపినట్లు గుల్షన్ పేర్కొన్నారు.

గ్రామాల్లో పాముల బెడద



తిరుమలాపూర్‌లో పామును పడుతున్న ఆజమ్

కులకచర్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాముల బెడద అధికమైంది. వర్షాకాలం కావడంతో విషపూరిత పాములు గ్రామాల్లోని వీధుల్లోకి, ఇళ్లలోకి చొరబడుతున్నాయి. శనివారం ఒక్కరోజే పాములు పట్టే కులకచర్లకు చెందిన ఆజమ్ మూడు పాములు పట్టి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాడు. ముజాహిద్‌పూర్ గేటు దగ్గర ఒకరి ఇంట్లో, కులకచర్లలో ఓ ఇంట్లో, తిరుమలాపూర్ ఓ ఇంటి దగ్గర పాములు సంచరిస్తుండగా ఆజమ్ వాటిని బంధించి తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలేశాడు. ఇళ్లలోకి పాములు వస్తే తమకు సెల్. 6301567044 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆజమ్ తెలిపాడు. ప్రభుత్వం వేతనం ఇచ్చి ఆదుకోవాలని ఆజమ్ కోరాడు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కీలకమైనది



తాండూరు రూరల్: ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎంను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయ బృందం



పెద్దేముల్: ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తాండూరు రూరల్, జూన్ 28, (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కీలకమైనదని రిటైర్డ్ ఉపాధ్యాయ బృందం ప్రతినిధులు అన్నారు. తాండూరు మండలం దస్తగిరిపేట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సౌదర్పల్లి సుభాష్ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయనను రసూల్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో శనివారం రిటైర్డ్ ఉపాధ్యాయ బృందం ప్రతినిధులంతా సన్మానించారు. రిటైర్డ్ ఉపాధ్యాయ బృందం ప్రతినిధులు నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఎల్లప్ప, నర్సిరెడ్డి, బిక్కు సింగ్ పెద్దేముల్ మండల ఇన్‌చార్జి ఎంపీడీవో రతన్‌సింగ్, మాజీ సర్పంచ్ రాములు, అనిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం రసూల్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం కోసం రూ.11వేలను అందజేశారు. అదేవిధంగా జినుగుర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా కొనసాగుతున్న మృత్యుంజయ స్వామి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం బీసీ నాయకులు పి.ఉత్తంచంద్, బీఆర్ఎస్ నాయకులు రాంలింగారెడ్డిలు సన్మానించారు.

పెద్దేముల్: మంబాపూర్ గ్రామంలో ఎస్ఏ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ గతనెలలో ఉద్యోగవిరమణ పొందిన ఇరుపాక సరితకు మంబాపూర్ జడ్పీపాఠశాల తరపున ఉపాధ్యాయులు, అమ్మఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐ మహిపాల్‌రెడ్డికి సన్మానం



తాండూరు రిటైర్డ్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు: 41ఏళ్లుగా క్రమశిక్షణతో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్క్ లేకుండా ఎస్ఐ మహిపాల్‌రెడ్డి పోలీస్‌శాఖలో సేవలందించారని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మహిపాల్‌రెడ్డి పోలీస్‌శాఖలో ఓ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి అంచెలంచెలుగా హెడ్‌కానిస్టేబుల్‌గా, ఏఎస్ఐగా, ఎస్ఐగా ఉదోన్నతులు పొంది సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేఆర్‌డీఎస్పీ వీరేశ్, జిల్లా పోలీస్ శాఖ అధ్యక్షుడు అశోక్, మహిపాల్‌రెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నాణ్యత.. నగుబాటు!

(ఐదో పేజీ తరువాయి)

సమస్యలు కనిపించడం లేదా? అని ఆయా కాలనీల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొత్తగా వెలసిన భవానీ నగర్, తిరుమల రెసిడెన్సీ, మైత్రీ, శ్రీనివాస హిల్స్, వెంకటేశ్వర కాలనీ, ఆర్టీసీ కాలనీల్లో ఐదారేళ్లగా నుంచి లక్ష రూపాయలు ఖర్చు చేసిన దాఖలాలు లేవు. ఈ కాలనీల్లో చిన్నపాటి వర్షం వస్తే కాలు బయట పెట్టలేని పరిస్థితి. సమస్య ఉన్నా, లేకున్నా పలుకుబడి ఉంటే, అక్కడి నుంచే పనులు మొదలు పెట్టి పూర్తి చేస్తున్నారు.

కనిపించని నాణ్యతా ప్రమాణాలు

మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్డు డివైడర్ నిర్మాణాల పనుల్లో కనీస నాణ్యత కనిపించడం లేదు. సిమెంట్, కంకర, ఇసుక సరైన పాళ్లలో కలపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అసలు సీసీ పనుల్లో ఇసుకకు బదులు డస్ట్‌ను వినియోగిస్తున్నారు. సీసీ, సైడ్‌డ్రెయిన్ నిర్మాణాలు చేపట్టిన వారం, పది రోజుల్లోనే దెబ్బతింటున్నాయి. విస్తరణ పనులు, ఇతర నిర్మాణాలు చేపట్టిన తర్వాత వాటర్ క్యూరింగ్ అసలు చేపట్టడం లేదు. దీంతో వాహనాల రాకపోకలకు అవి పగిలిపోతున్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఏం లాభం అని స్థానికులు వాపోతున్నారు. ఈ పనులు గుత్తేదారుల లాభం కోసం చేస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు.

పనులన్నీ డస్ట్‌తోనే

నిర్మాణ పనుల్లో ఇసుక వాడాల్సి ఉన్నా.. ఒక గంప కూడా వినియోగించని పరిస్థితి. పరిగి మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే మూడు కోట్ల విలువైన పనులు చేశారు. అయితే ఇప్పటి వరకు ఒక్క ట్రాక్టర్ ఇసుక కూడా వాడలేదు. డస్ట్‌తో చేపట్టే పనులు అప్పుడే దెబ్బతింటున్నాయి. రికార్డుల్లో ఇసుక వాడినట్లు చూపిస్తుండటం గమనార్హం. అధికారులు, పాలకులు, కాంట్రాక్టర్లు కలిసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యతపై అధికారపక్షం అటుంచితే, విపక్ష నాయకులు పట్టించుకోవడం ప్రజలు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు.



పాత పరిగిలో అధ్వానంగా సీసీరోడ్డు

మిగిలింది రెండు రోజులే

(ఐదో పేజీ తరువాయి)

పంపిణీ చేశారు. నేడు, రేపు పంపిణీతో వంద శాతం పూర్తి చేయాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా లబ్ధిదారులకు ఫోన్లు చేసి మరీ సమాచారం చేరవేస్తున్నారు.

జూలై 5 వరకు పంపిణీ..?

కాగా మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ రేపటితో ముగుస్తుండటం.. రేషన్ దుకాణాలకు లబ్ధిదారులు పోటెత్తున్న నేపథ్యంలో జూలై 5వ తేదీ వరకు పంపిణీ అవకాశాన్ని పొడిగించేందుకు ప్రభుత్వం యోచన చేస్తున్నట్లు సమాచారం. పంపిణీ ప్రక్రియ వంద శాతం పూర్తికాకపోవడంతో మరో 5 రోజులు అవకాశం ఇవ్వాలనే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై రేపు అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశముంది.

వంద శాతం పంపిణీ చేస్తాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నాం. కోటా సరఫరాలో కొంత ఆలస్యమౌతోంది. నేడు, రేపు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందించి వంద శాతం పంపిణీ పూర్తి చేస్తాం.

- శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌వో, మేడ్చల్

మొక్కజొన్న, ధాన్యం బీట్లు

ధారూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం మొక్కజొన్న, ధాన్యం బీట్లు నిర్వహించారు. మొక్కజొన్న క్వింటాలుకు రూ.1,850ల నుంచి రూ.2,220ల వరకు, ధాన్యం 1010రకం క్వింటాలుకు రూ.1,700ల నుంచి రూ.1,850ల వరకు, సోనారకం క్వింటాలుకు రూ.1,700ల నుంచి రూ.2,125ల వరకు ధరలు పలికాయి. మొక్కజొన్న 60.5 క్వింటాళ్లు, ధాన్యం 59.2 క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలి

దోమ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శివారెడ్డిపల్లిలో శనివారం ఎంపీడీవో గమ్యానాయక్ వననర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామ పంచాయతీలో 40 వేల మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

పీవీ సేవలు మరువలేనివి



పరిగి: పీవీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మేడ్చల్ టౌన్: పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మేడ్చల్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశానికి మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పీవీ జయంతి వేడుకలను శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివేకానంద చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన పీవీ నర్సింహారావు చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, సంతోశ్‌గౌడ్, మధుకర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ దేవ, కౌడె మహేశ్ పాల్గొన్నారు.

పరిగి: దేశఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మహనీయుడు పీవీ అని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్వర్గీయ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా శనివారం పరిగిలోని ఆయన చిత్రపటానికి పార్టీ పరిశీలకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శేటి నరేందర్‌లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, పార్థసారథి, లాల్‌కృష్ణప్రసాద్, హన్మంత్, కృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

కులకచర్ల/చౌడాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించేందుకు సైనికుల్లా పని చేయాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు.కులకచర్లలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకులు నరేందర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు. అదే విధంగా చౌడాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, నరేదంర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, నాగరాజు, రామ్మోహన్‌శర్మ, గోపాల్‌నాయక్, నరసింహనాయక్, సలీమ్, రాము పాల్గొన్నారు.

దోమ: పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌రెడ్డి, కో ఆబ్జర్వర్ రామ్‌శెట్టి నరేందర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయి, మండల స్థాయి నూతన కమిటీలు వేయాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

తాండూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదల కోసం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని సంగెంకలాన్, కొత్లాపూర్ గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, రేణుకా ఎల్లమ్మ దేవాలయం చైర్మన్ నవీన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బుడ్డెళ్లి సాయిలు, పూజారి మల్లు, బైండ్ల వెంకటప్ప, బైండ్ల రాజు ఉన్నారు.

భృంగీ స్కూల్‌కు నోటీసులు

పరిగి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని భృంగీ ఇంటర్నేషనల్ స్కూల్‌కు నోటీసులు జారీ చేసినట్లు పరిగి ఎంఈవో గోపాల్ తెలిపారు. పాఠశాలలో నోట్‌బుక్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శనివారం పాఠశాలను సందర్శించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణకు నోటీసులు అందజేశారు. నోటీసుకు సంజాయిషీ ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో మెరుగైన వైద్యం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కందకట్ల సందీప్‌రెడ్డి తెలిపారు. అవుశాపూర్‌కు చెందిన పడిగం బిక్షపతికి రూ.60వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదవరెడ్డి, జంగయ్య, శంకర్‌గౌడ్, చిన్నయాదవ్, ముద్దం మల్లేష్, నర్సింహ నాయక్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

శామీర్‌పేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడానికి బాధ్యతగా కృషిచేస్తానని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మజీద్‌పూర్ ప్రజయ్ హోమ్స్ కాలనీలో శనివారం ప్రజలకు తడి, పొడిచెత్తపై మున్సిపల్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ వేణుగోపాల్, ప్రజయ్ హోమ్స్ కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్‌టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ సబ్‌స్టేషన్‌లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మూడుచింతలపల్లి/కొడంగల్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలు శామీర్‌పేట్, కొడంగల్ పరిధిలో చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. శామీర్‌పేట్ మండలం అంతాయిపల్లికి చెందిన మంచాల కుమార్(36) తూంకుంటలోని కృష్ణ హోటల్ వద్ద రోడ్డు దాటుతుండగా టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి కుమార్‌ను ఢీకొట్టాడు. దీంతో అతడి తల, ముక్కుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనక నుంచి బైక్ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లికి చెందిన బుడగ జంగం శేఖర్(25) రోజు మాదిరిగా రావుల్‌పల్లిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైద్రాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి అంగడిరైచూర్ గేటు సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు శేఖర్‌కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

మూడుచింతలపల్లి, జూన్ 28, (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన అఫ్సర్(36) బతుకుదెరువు నిమిత్తం మూడుచింతలపల్లికి వలస వచ్చి ఇంటిని కిరాయి తీసుకొని పాన్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన భార్య సైదాఅన్సర్‌కు ఫోన్‌చేయగా ఎత్తకపోవడంతో ఇంటి యజమానిని సంప్రదించారు. వెళ్లి తలుపు తట్టగా ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా చీరతో స్లాబ్‌కు ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచానామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

500 గ్రాముల గంజాయి పట్టివేత

● ఇద్దరిపై కేసు నమోదు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

కొడంగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వారి దగ్గరి నుంచి 500గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం కొడంగల్ శివారులోని తాండూర్ రోడ్డులో చోటుచేసుకుంది. సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, నిఖిల్ ఇద్దరు బీదర్‌లోని ఇరానీ గల్లీలో గంజాయిని కొనుగోలు చేసి కొడంగల్‌లో అమ్మేందుకు వస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ జీవీ.సత్యనారాయణ సిబ్బందితో పట్టణ శివారులోని శివశక్తి ధర్మకాంట దగ్గర వాహనాలు తనిఖీ చేశారు. ఈ మేరకు అనుమానాస్పదంగా కనిపించిన శ్రీనివాస్ రెడ్డి, నిఖిల్ వద్ద తనిఖీ చేయగా 500గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈఘటనపై కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ పరిసరాల్లో మద్యం విక్రయించినా, తాగినా క్రిమినల్ కేసు

శామీర్‌పేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కట్టమైసమ్మ ఆలయ పరిసరాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినా, తాగినా కఠినంగా క్రిమినల్ కేసు నమోదు చేస్తామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ హెచ్చరించారు. శామీర్‌పేటలోని కట్టమైసమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఆలయ కమిటీ సభ్యుల, వివిధ షాపుల నిర్వాహకులతో శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టమైసమ్మ ఆలయం పరిసరాల్లో ఫంక్షన్ షెడ్లలో విచ్చలవిడిగా మద్యం సేవించి మహిళలపై దాడులకు, అకృత్యాలకు, వికృతచేష్టలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులకు, షాపుల వ్యాపారులకు తగు సూచనలు చేశారు.

మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజీనామా

ధారూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పదవికి ఎల్.అశోక్‌ముదిరాజ్ శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన అనుచరులతో కలిసి మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్దమ్మకు తన రాజీనామాను అందజేసి ఆమోదించాలని కోరారు. కాగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పి.రఘువీరారెడ్డికి తగిన పదవి, గుర్తింపు ఇవ్వనందుకు నిరసనగా తాను పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

భౌగోళిక స్వరూపాలపై అవగాహన

మోమిన్‌పేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు భారతదేశ భౌగోళిక స్వరూపాలపై వివరించారు. ప్రొజెక్టర్ ద్వారా వివిధ భౌగోళిక ప్రాంతాలు (హిమాలయాలు, నదులు, మైదానాలు, పీఠభూములు, తీర ప్రాంతాలు, ఏడారులు, దీవులు) గురించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, నరేశ్ ప్రతీ ప్రాంతం యొక్క ప్రత్యేకతలు, ప్రాజెక్టు వర్క్‌పై వివరించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి కన్నుమూత



ఉపాధ్యాయుడు రాజు (ఫైల్)

కొడంగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన కొడంగల్ మండలంలో జరిగింది. అన్నారం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బోయ రాజు (రాఘవేందర్) అంగడిరైచూర్, హస్నాబాద్, చిట్లపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజు శనివారం మృతి చెందాడు. ఉపాధ్యాయుడు రాజు మృతి పట్ల ఎంఈవో రామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం అన్నారంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఓ కుమారుడు, కూతురు, భార్య ఉన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

బొంరాస్‌పేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎంఆర్‌ఎఫ్ సహాయంఅండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం బొంరాస్‌పేట్ మండలంలోని బాపల్లితండాలో తుల్జాబాయికి రూ.60వేలు, రమణిబాయికి రూ.2లక్షల 50వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంతోష్ నాయక్, మహేందర్‌సింగ్, హన్యానాయక్, దాస్యనాయక్, శివరామ్‌నాయక్, రూప్‌సింగ్‌నాయక్, భీమ్లానాయక్, బాల్యనాయక్, పత్యానాయక్, రాములు పాల్గొన్నారు.